సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
17వ వసంతంలోకి..
www.suryaa.com
EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
సోమవారం
22 జులై 2024
పేజీలు: 02



## నన్ను బోనులో బంధించారు

### ఇమ్రాన్ ఖాన్

ఎనిమిది అడుగుల పొడవు, ఏడడుగుల వెడల్పు ఉన్న బోనులో తనను బంధించి హింసిస్తున్నారని పాక్ మాజీ పీఎం ఇమ్రాన్ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. జైలు నుంచే ఓ బ్రిటిష్ పత్రికకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చినట్లు డాన్ పత్రిక తెలిపింది. 'కనీసం కదలడానికి కూడా చోటు లేదు. ఖైదీలకు ఉండే ప్రాథమిక హక్కులూ లేవు. ఉగ్రవాదిలా చూస్తున్నారు' అని ఆయన వాపోయారంది. కాగా పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఇమ్రాన్ రావల్పిండి జైల్లో ఖైదీగా ఉన్నారు.

## నేడు గంభీర్ చేతికి కోచ్ పగ్గాలు




టీమ్ ఇండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ నేడు బాధ్యతలు చేపట్టనున్నారు. అనంతరం చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌తో కలిసి ముంబైలో మీడియాతో మాట్లాడనున్నారు. కాగా ఈనెల 27 నుంచి శ్రీలంకతో జరిగే టీ20, వన్డే సిరీస్‌తో గౌతీ కోచింగ్ ప్రస్థానం ప్రారంభం కానుంది. మరోవైపు భారత్‌కు బౌలింగ్ కోచ్ లేకపోవడంతో ఈ సిరీస్‌కు తాత్కాలికంగా సాయిరాజ్ బహుతులెకు బీసీసీఐ ఆ బాధ్యతలు అప్పగించింది.

## ఢిల్లీలో రేవంత్.. నేడు కీలక భేటీలు!

ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ ఇవాళ కాంగ్రెస్ అధిష్ఠానంతో భేటీ కానున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని తాజా రాజకీయ అంశాలు, రాష్ట్ర బడ్జెట్‌లోని కీలక అంశాలు, ఈ నెలాఖరులో వరంగల్‌లో రైతు కృతజ్ఞత సభ, టీజీసీసీ కొత్త చీఫ్ నియామకం, క్యాబినెట్ విస్తరణ, నామినేటెడ్ పదవులపై చర్చించే అవకాశముంది. అలాగే రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అమిత్ షా, నిర్మలా సీతారామన్, గడ్కరీ, ఇతర శాఖల కేంద్ర మంత్రులతో సీఎం భేటీ అవుతారని సమాచారం.



### అమెరికా అధ్యక్ష రేసు నుంచి తప్పుకున్న జో బైడెన్..

# డెమొక్రటిక్ అభ్యర్థిగా కమలాహారిస్!

అధ్యక్ష ఎన్నికల వేళ అమెరికా రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకొన్నది. అధ్యక్ష ఎన్నికల బరి నుంచి ప్రస్తుత అధ్యక్షుడు, డెమోక్రటిక్ పార్టీ నేత జో బైడెన్ తప్పుకొన్నారు. ఈ మేరకు బైడెన్ స్వయంగా ఆదివారం తన ఎక్స్ ఖాతాలో ప్రకటన చేశారు. దేశంతోపాటు డెమోక్రటిక్ పార్టీ ప్రయోజనాల కోసం అధ్యక్ష ఎన్నికల నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించిన 81 ఏండ్ల బైడెన్.. దేశాధ్యక్షుడిగా 2025, జనవరి వరకు ఉన్న తన పూర్తి పదవీ కాలం కొనసాగుతానని స్పష్టం చేశారు.గత నెల ట్రంప్‌తో జరిగిన డిబేట్‌లో తడబాటు, ఇతరత్రా అంశాల నేపథ్యంలో అధ్యక్ష పోటీ నుంచి తప్పుకోవాలని సొంత పార్టీ నేతల నుంచి ఒత్తిడి పెరగడంతో బైడెన్ ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలుస్తున్నది. దేశానికి అధ్యక్షుడిగా సేవలు అందించడం తన జీవితంలో గొప్ప గౌరవమని బైడెన్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. 'తిరిగి ఎన్నిక కావాలనేది నా ఉద్దేశం. అయితే దేశం, పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్నా. మిగతా పదవీ కాలం అధ్యక్షుడిగా నా బాధ్యతలు నిర్వర్తించడంపై దృష్టి పెడుతా' అని అన్నారు.

**కమలా హారిస్‌కు లైన్ క్లియర్**

ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్న క్రమంలో డెమోక్రటిక్ పార్టీ తరపున అభ్యర్థిగా ప్రస్తుతం ఉపాధ్యక్షురాలిగా ఉన్న కమలా హారిస్ పేరును బైడెన్ ప్రతిపాదించారు. 2020లో ఉపాధ్యక్ష నామినీగా కమలా హారిస్‌ను ఎంపిక చేస్తూ అప్పట్లో నిర్ణయం తీసుకొన్నానని, అది తాను తీసుకొన్న బెస్ట్ నిర్ణయమని బైడెన్ పేర్కొన్నారు. ఆమె ఒక అద్భుతమైన భాగస్వామి



అని కొనియాడారు. 'ఈ ఏడాది అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ఈ రోజున కూడా నా పూర్తి మద్దతు, ఆమోదం కమలా హారిస్‌కు ఇస్తున్నాను' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. పార్టీ నేతలు, అందరూ కలిసికట్టుగా పోరాటం చేసి, ట్రంప్‌ను ఓడించాలని ఈ సందర్భంగా ఆయన డెమోక్రాట్లకు పిలుపునిచ్చారు. అధ్యక్ష బరి నుంచి తప్పుకోవడంపై తాను జాతినుద్దేశించి తర్వాత ప్రసంగిస్తానని బైడెన్ పేర్కొన్నారు.

**1987లోనే అధ్యక్ష పదవికి పోటీ**

జో బైడెన్ 1942లో పెన్సిల్వేనియాలో జన్మించారు. డెలావేర్ విశ్వవిద్యాలయం, సిరాక్యూస్ లా స్కూల్‌లో చదువుకున్నారు. మొదట పబ్లిక్ డిఫెండర్‌గా పని చేసి, ఆ తర్వాత రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1972లో 29 ఏళ్ల వయసులో అమెరికా సెనేట్‌కు పోటీ చేశారు.

### బైడెన్ కంటే కమలా హారిస్‌ను ఓడించడం ఇంకా సులభం: ట్రంప్

డెమొక్రటిక్ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ అయితే ఆమెను ఓడించడం మరింత సులువని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అధ్యక్ష పదవి రేస్ నుంచి జో బైడెన్ తప్పుకున్న తర్వాత ఆయన స్పందించారు. బైడెన్ కంటే కమలా హారిస్‌ను ఓడించడం ఇంకా సులభమని ధీమా వ్యక్తం చేశారు. దేశ చరిత్రలో అత్యంత చెత్త అధ్యక్షుడు జో బైడెన్ అంటూ ఫైర్ అయ్యారు.అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి జో బైడెన్ తగినవాడు కాదని చెప్పారు. ఆ హోదాలో పనిచేసే అర్హత ఆయనకు ఏనాడూ లేదు.



### మధుసూధన్ రావు గుర్తు పెట్టుకో.. ఎల్లకాలం ఇలాగే ఉండదు..

## పోలీసులకు వార్నింగ్ ఇచ్చిన

# వైఎస్ జగన్

ఏపీలో నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఆరంభం అయ్యాయి. అయిదు రోజుల పాటు కొనసాగనున్నాయి. పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టదలచుకోలేదు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలోని తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వం. ఇప్పుడు కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ వైపే మొగ్గు చూపింది. మూడు నెలల కాలానికి సంబంధించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సభకు సమర్పిస్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై చర్చించడానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టుబట్టనుంది. ఇందులో భాగంగా వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఆ పార్టీకి చెందిన ఇతర శాసన, మండలి సభ్యులు.. నల్ల కండువాలను ధరించి నిరసన వ్యక్తం చేస్తోన్నారు. ఉభయ సభల్లో ప్రదర్శించడానికి ప్లకార్డులను వాళ్లు వెంట తెచ్చుకున్నారు. చంద్రబాబు- పవన్ కల్యాణ్ ప్రభుత్వానికి నిరసనగా నినాదాలు చేశారు. దారిలోనే పోలీసులు- వైఎస్ జగన్ సహా మిగిలిన సభ్యులందరినీ అడ్డుకోవడం



ఉద్రిక్తతకు దారి తీసింది. అసెంబ్లీ వైపు వెళ్లడానికి ప్రయత్నించిన జగన్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఆ సమయంలో తోపులాట చోటు చేసుకుంది. పోలీసులతో వాగ్యుద్ధం నెలకొంది. జగన్ సహా మిగిలిన వారిని పోలీసులు వెనక్కి నెట్టే ప్రయత్నానికి దిగడం వారిలో ఆగ్రహావేశాలకు కారణమైంది. దీనితో పోలీసుల తీరుపై జగన్ మండిపడ్డారు. తమ చేతుల్లో ఉన్న ప్లకార్డులను లాక్కుని, చించిపడేసే హక్కు, అధికారం ఎవరు ఇచ్చారంటూ నిలదీశారు జగన్. మధుసూదన్ రావ్ గుర్తు పెట్టుకో.. అంటూ తనను అడ్డుకున్న పోలీసు అధికారిని ఉద్దేశించి హెచ్చరించారాయన. ఎల్లకాళం ఇదే మాదిరిగా ఉండదు. ప్రజాస్వామ్యంలో ఉన్నాం మనం. నీ టోపీ మీద ఉన్న సింహాలకు అర్థం ఏమిటో తెలుసా?. అధికారంలో ఉన్నవాళ్లకు సెల్యూట్ కొట్టడం కాదు.. అంటూ జగన్ హితవు పలికారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి పోలీసులు ఉన్నారని గుర్తు చేశారు.

## గవర్నర్ ప్రసంగం.. వైసీపీ నిరసన

### ఏపీ అసెంబ్లీ సమావేశాలు రేపటికి వాయిదా

ఏపీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగం ప్రారంభించగానే వైసీపీ ఎమ్మెల్యేలు నిరసనకు దిగారు. జగన్ సహా ఎమ్మెల్యేలంతా నల్ల కండువాలతో సభకు హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ స్లోగన్స్ ఇచ్చారు. అనంతరం వైసీపీ సభ్యులంతా సభ నుంచి వాకౌట్ చేశారు.

## మరో 107 రోజులే.. కలిసి పోరాడుదాం: కమలా హారిస్

యూఎస్ అధ్యక్ష అభ్యర్థిగా బైడెన్ తనను నామినేట్ చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నానని ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అన్నారు. బైడెన్ నిస్వార్థంగా దేశానికి సేవలు అందించారని కొనియాడారు. డెమోక్రటిక్ పార్టీలో, దేశంలో ఐక్యత తెచ్చేందుకు తన శక్తి మేరకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎన్నికలకు మరో 107 రోజులే ఉందని, అందరం కలిసికట్టుగా పోరాడి విజయం సాధించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



## ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చేనా?



ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయి జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవిత జుడీషియల్ కస్టడీ నేటితో ముగియనుంది. ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఇవాళ విచారణ జరపనుంది. ఆమె ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో బెయిల్ ఇవ్వాలని ఆమె తరఫు లాయర్లు వాదించే అవకాశముంది. దీంతో బెయిల్ వస్తుందా? రాదా? అనేది ఆసక్తికరంగా మారింది. నేడు కవితను ఆమె సోదరుడు కేటీఆర్ కలవనున్నట్లు సమాచారం.




## 'మీ భర్త ఎవరో చెప్పండి': శాంతికి నోటీసులు

దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి, వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డిపై చేసిన ఆరోపణలు చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. తాజాగా 'మీ భర్త ఎవరో వివరణ ఇవ్వండి' అంటూ శాంతికి దేవదాయ శాఖ నోటీసులు ఇచ్చింది. 'ఉద్యోగంలో చేరినప్పుడు భర్త పేరు మదన్‌మోహన్ అని పేర్కొన్నారు. ఇటీవల ప్రెస్‌మీట్‌లో సుభాష్‌ని పెళ్లి చేసుకున్నట్లు చెప్పారు. ఇది ఉద్యోగి ప్రవర్తనా నియమావళికి విరుద్ధం' అని నోటీసుల్లో పేర్కొంది.

### ప్రపంచ ప్రముఖుల ఫ్యాషన్ షో..

# ఆకట్టుకుంటున్న మస్క్ ట్వీట్

ప్రపంచంలో ప్రముఖ నేతలు, టాప్ కంపెనీల అధినేతలు ఫ్యాషన్ షోలో పాల్గొంటే ఎలా ఉంటుంది. ఇదిగో అచ్చం ఇలాగే ఉంటుంది.. అయితే వాస్తవానికి ఇది సాధ్యంపోయినా, అసలు మనం ఊహించకపోయినా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానమైన కృత్రిమ మేధతో సుసాధ్యమైంది. ఏఐ ఫ్యాషన్‌కు ఇదే మంచి సమయం అంటూ టెస్లా సీఈవో, ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ఓ వీడియోను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇప్పుడిది అందరినీ ఆకట్టుకుంటున్నది.రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని మోదీ, అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్, అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత జిన్‌పింగ్, కెనడా ప్రధాని



ట్రుడో, అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్, ఫేస్‌బుక్ చీఫ్ మార్క్ జుకరబర్గ్, ప్రపంచ కుబేరుడు మస్క్, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇలా ఒకరి వెంట ఒకరు ర్యాంప్ వాక్ చేస్తూ కనిపించారు.

## అవినీతికి మారురూపం శరద్ పవార్: అమిత్ షా

ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. అవినీతిని వ్యవస్థీకృతం చేసిన నేతగా పవార్ దేశ చరిత్రలో నిలిచిపోతారని బీజేపీ రాష్ట్రస్థాయి సదస్సులో ధ్వజమెత్తారు. ఔరంగజేబు అభిమానుల సంఘానికి ఉద్ధవ్ ఠాక్రే అధ్యక్షుడని ఎద్దేవా చేశారు. మహారాష్ట్రలో మళ్లీ బలం పుంజుకుని ప్రభంజనం సృష్టిస్తామని ఈ సందర్భంగా షా ధీమా వ్యక్తం చేశారు.



## రేపటి నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు.. కీలక బిల్లులకు ఆమోదం?

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు రేపటి నుంచి జరగనున్నాయి. ఈ సమావేశాల్లో పూర్తిస్థాయి బడ్జెట్‌తో పాటు స్కిల్ వర్సిటీ బిల్లుకు ఆమోదం తెలపనున్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటన, రైతు భరోసా విధివిధానాలు, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల్లో అక్రమంగా లబ్ధిపొందిన వారి నుంచి రికవరీ, తెలంగాణ తల్లి విగ్రహం, రాష్ట్ర చిహ్నం, విద్య, వ్యవసాయ కమిషన్ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించి తీర్మానం చేయనున్నట్లు సమాచారం.





## అత్యధిక బడ్జెట్లు ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి ఎవరంటే?

అత్యధికసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రిగా మొరార్జీ దేశాయ్ నిలిచారు. 1959 ఫిబ్రవరి 28న తన తొలి బడ్జెట్ ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్ తర్వాత రెండేళ్లు పూర్తిస్థాయి బడ్జెట్లు తీసుకొచ్చారు. 1962లో తాత్కాలిక బడ్జెట్ ఆ తర్వాత రెండేళ్లు ఫుల్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. 1967లో మరోసారి తాత్కాలిక పద్దును తెచ్చారు. ఆ ఏడాది మళ్లీ ఫుడ్ బడ్జెట్ ప్రవేశపెట్టిన దేశాయ్ 1968, 1969లోనూ పూర్తి పద్దును ముందుంచారు.

## సివిల్ సర్వీసుల్లో దివ్యాంగ కోటా ఎందుకు?.. వివాదాస్పదంగా ఐఏఎస్ స్మితా సబర్వాల్ ట్వీట్

దివ్యాంగులకు సివిల్ సర్వీస్ బాధ్యతలు సక్రమంగా నిర్వహించే సామర్థ్యం లేదని తెలిపారు. దివ్యాంగులంటే తనకు అపారమైన గౌరవం ఉన్నదని చెప్పారు. ఏదైనా విమానయాన సంస్థ పైలట్‌గా దివ్యాంగులను నియమిస్తుందా? ఒక దివ్యాంగ సర్జన్ వైద్యం చేస్తానంటే మీరు నమ్ముతారా? ఏఐఎస్ (ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్) ఉద్యోగం అంటేనే క్షేత్రస్థాయి పర్యటనలు, గంటలపాటు నిలబడటం, తమ వద్దకు వచ్చే ప్రజల సమస్యలను సావధానంగా వింటూ ఉండాల్సి ఉంటుంది. ఇందుకు శారీరకంగా దృఢంగా ఉండాలి. అలాంటి ఉద్యోగాల్లో దివ్యాంగ కోటా ఎందుకు?' అని ఆమె ప్రశ్నించారు.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## రంగం భవిష్యవాణి వినిపించిన స్వర్ణలత

సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవం రెండో రోజు ఘనంగా జరుగుతోంది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి భారీ ఎత్తున పోటెత్తుతున్నారు. బోనాల వేడుకలో భాగంగా భక్తురాలు స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. మట్టి బోనమైనా, స్వర్ణ బోనమైనా.. ఎవరు తీసుకొచ్చినా తాను సంతోషంగా అందుకుంటానని ఆమె తెలిపారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని చెప్పారు. వ్యాధులు రాకుండా ప్రజలను కాపాతానని అభయమిచ్చారు. ప్రజలను చల్లగా చూస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, భక్తులు అడిగిన సందేహాలను మాతంగి స్వర్ణలత నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. ఈ ఏడాది భక్తులు 48 గంటలు వర్షంలో తడుస్తూ అమ్మ దర్శనం చేసుకున్నారని చెప్పగా.. నా దర్శనం చేసుకోవాలంటే ఆ మాత్రం కష్టపడాలి అప్పుడే ఫలితం ఉంటుంది అని మాతంగి అన్నారు. ఈ ఏడాది పూజలు ఘనంగా అందుకున్నానని.. ఎంతో సంతోషంగా ఉన్నానని తెలిపారు.



## హరియాణాలో 24గంటలు ఇంటర్నెట్ బంద్

హరియాణాలో నేడు జరగనున్న బ్రజ్ మండల్ జలాభిషేక్ యాత్ర దృష్ట్యా ఆ రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల పాటు ఇంటర్నెట్ సేవల్ని నిలిపేసింది. గత ఏడాది జులై 31న ఇదే యాత్ర హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఇద్దరు హోంగార్డులు మరణించారు. ఈ నేపథ్యంలో నేటి యాత్రకు భారీగా భద్రతాబలగాలు రంగంలోకి దిగాయి. డ్రోన్లతో నిఘా వేయనున్నాయి. దుష్ప్రచారం వ్యాప్తి చెందకుండా ఉండేందుకే నెట్ ఆపేసినట్లు ప్రభుత్వం వివరించింది.

## ఆగస్టులో
# ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చే ప్రక్రియపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక అప్డేట్ ఇచ్చారు. ఆగస్టులో ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే.. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోందని.. ఆగస్టులో తప్పనిసరిగా అందజేస్తామని పేర్కొన్నారు. ఆదివారం రోజున హైదరాబాద్‌లో రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా మువ్వా విజయబాబు బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. విజయబాబు రైతు నుంచి వచ్చిన నాయకుడని.. ఆయన తన పదవికి న్యాయం చేస్తాడనే నమ్మకం ఉందన్నారు. రాష్ట్రంలోని రైతులకు నీరందించడంలో.. నీటి పారుదల అభివృద్ధి సంస్థకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు.. ఖమ్మం జిల్లా మంత్రులం కూడా అండగా ఉంటామని తెలిపారు. రైతులకు సంబంధించిన టీజీఐడీసీ సంస్థను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూనే.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయటమే కాకుండా.. అభివృద్ధిని కూడా అందజేస్తున్నామని తెలిపారు మంత్రి పొంగులేటి. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. రైతులకు రూ. 31వేల కోట్ల రుణ మాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాగితాలకే అంకితం చేశారన్నారు. గత ప్రభుత్వం నీటి పారుదల, ధరణి ద్వారా రైతుల పట్ల తప్పుడు నిర్ణయాలను తీసుకోగా తాము సరి చేస్తూ చట్ట సవరణలు తెస్తున్నామన్నారు. మరోవైపు.. రాష్ట్రంలో ఎడతెరపిలేకుండా




కురుస్తున్న వర్షాల నేపథ్యంలో.. అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం సాయంత్రం అన్ని జిల్లాల్లో వరద పరిస్థితిని మంత్రి సమీక్షించారు. జిల్లా యంత్రాంగం సహాయ పునరావాస చర్యల్లో నిమగ్నమై.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాలతో పాటు గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఇప్పటికే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయటంతో.. అక్కడి పరివాహక ప్రాంతాల ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రెస్క్యూ టీంలు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను వినియోగించాలని అధికారులకు సూచించారు. జిల్లాల్లో కలెక్టరేట్లలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయాలని.. పోలీస్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.



## నేషనల్ క్రష్ అని పిలుస్తుంటే
### ఆనందంగా ఉంది

'బ్యాడ్‌న్యూస్' విజయంతో గుడ్‌న్యూస్ అందుకొని మంచి జోష్‌మీద ఉన్నది 'యానిమల్' భామ త్రిప్తి దిమ్రి. 'యానిమల్'కి ముందు వరకూ నేషనల్ క్రష్ అంటే రష్మిక మందన్నా మాత్రమే. ఇప్పుడు ఆ బిరుదు త్రిప్తి దిమ్రికి కూడా ఇచ్చేశారు యూత్. ఈ ట్యాగ్‌పై ఆమె ఇటీవల స్పందిస్తూ 'అసలు నేను సినిమాను సీరియస్‌గా తీసుకోలేదు. తొలి సినిమా పూర్తి చేశాను. కెరీర్‌ని విధికే వదిలేశా. ఆ టైమ్‌లోనే 'లైలా-మజ్ను' అనే సినిమాకు సంబంధించిన ఆడిషన్స్‌లో కూడా పాల్గొన్నా. సరదాగా మొదలుపెట్టిన యాక్టింగ్.. ఉన్నట్టుండి సీరియస్‌గా మారింది. అదృష్టం బావుంది.. 'యానిమల్' వచ్చింది. ఇప్పుడందరూ నా యాక్టింగ్‌కి కనెక్ట్ అవుతున్నారు. ఈ రోజు అందరూ నన్ను నేషనల్ క్రష్ అంటున్నారంటే అదంతా వారి ప్రేమ, అలా పిలుస్తున్నందుకు ఆనందంగా ఉంది. అది నాపై మరింత బాధ్యత పెంచింది.' అంటూ ఆనందం వక్తం చేసింది.






## ముంబైని ముంచెత్తుతున్న భారీ వర్షాలు

దేశ ఆర్థిక రాజధాని ముంబైని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో నగరం మొత్తం తడిసి ముద్దవుతోంది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకూ కేవలం 24 గంటల వ్యవధిలో ముంబైలోని చాలా ప్రాంతాల్లో 200 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ తెలిపింది.ట్రాంబేలో 241 మి.మీటర్ల గరిష్ఠ వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. ఆ తర్వాత వడాలాలో 223 మి.మీ, ఘట్‌కోపర్‌లో 215 మి.మీ, వర్లీలో 204 మి.మీ, సెవ్రిలో 203 మి.మీ, బీకేసీలో 199 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముంబైలో అధికారులు హై టైడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ కుండపోత వర్షాలకు మహా నగరంలో జనజీవనం స్తంభించిపోయింది. అనేక ప్రాంతాలు నీట మునిగాయి. ఇవాళ కూడా నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని నవీ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ విపత్తు నిర్వహణ విభాగం సూచించింది. ఇక భారీ వర్షాల కారణంగా నగరంలోని చాలా ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. పలు చోట్ల ట్రాఫిక్‌కు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది. రైళ్లు, విమాన రాకపోకలకు సైతం ఇబ్బందులు తలెత్తాయి.



## భారీ వర్షాలతో ప్రాజెక్టుల్లో జలకళ
# డీకే శివకుమార్

దేశవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పలు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి, నీటి ఎద్దడితో సతమతమైన కర్నాటకలోనూ ఇటీవలి భారీ వర్షాలతో పరిస్థితి చక్కబడింది. భారీ వర్షాలతో తగినంత నీరు వచ్చిచేరిందని నీటి ఎద్దడి నివారణ దిశగా ఈ సంతోషకరమైన వార్తను పంచుకుంటున్నానని కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు.సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలని తాను రైతాంగాన్ని కోరుతున్నానని, వరద నీరు అధికంగా పోటెత్తితే అప్రమత్తం కావాలని తాను సూచించానని చెప్పారు. ఇక ఈ వారంలో పవిత్రమైన దినాల్లో నదులకు పూజ చేయాలని తాను రైతులను కోరానని తెలిపారు. ఈ విషయంపై తాను సీఎం సిద్ధరామయ్యతో మాట్లాడానని, గంగా పూజ నిర్వహించే వారణాసికి తాను ఓ బృందాన్ని పంపించానని వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి అదే తరహా పూజను కర్నాటకలో నిర్వహిస్తామని అన్నారు. కరువులు, వరదలు నివారించి ఏటా మన డ్యామ్‌లు నీటితో నిండాలని కోరుతూ ఈ తరహా పూజలు క్రమం తప్పకుండా తాము నిర్వహించేందుకు కసరత్తు సాగిస్తున్నామని డీకే శివకుమార్ తెలిపారు. ఇక ఇటీవలి భారీ వర్షాలకు రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు చేరింది.



## పార్లమెంట్ రాజకీయాలకు కాదు..
### దేశం కోసం: ప్రధాని మోదీ

రాజకీయాలు చేయడానికి పార్లమెంట్ వేదిక కాదని.. దేశం కోసం ఉందని ప్రధాని మోదీ ప్రతిపక్షాలకు హితవు పలికారు. నేడు పార్లమెంట్ సమావేశాలకు ముందు ఆయన మాట్లాడుతూ "మనం 2029 ఎన్నికల్లో మరోసారి తలపడదాం. అప్పటివరకు పార్లమెంట్‌ను మహిళలు, రైతులు, యువత జీవితాలను బాగు చేసేందుకు వాడదాం" అని పేర్కొన్నారు. సభలో నిరంతరం గందరగోళం వల్ల కొందరు సభ్యులు తమ పాయింట్లను చెప్పలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రజలు తీర్పు ఇచ్చేశారని చెప్పిన మోదీ.. ఇక ఆ రాజకీయాల నుంచి పార్టీలు బయటకువచ్చి దేశం కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. ఈసారి ప్రవేశ పెట్టబోయే బడ్జెట్ అత్యంత కీలకమైందని ప్రధాని మోదీ అభివర్ణించారు. వచ్చే ఐదేళ్లకు తమకు కార్యనిర్దేశం చేసేదిగా ఈ బడ్జెట్ ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాదు.. వికసిత్ భారత్‌కు ఇది పునాది వేస్తుందని చెప్పారు.

## ఆ నిర్దేశాలపై స్టే విధించిన సుప్రీంకోర్టు..
# 3 రాష్ట్రాలకు నోటీసులు జారీ

కన్వరీ యాత్రా మార్గంలోని స్టాల్స్, హోటళ్ల యజమానులు ఆయా స్టాల్స్, హోటల్స్ నేమ్ ప్లేట్స్‌పై తమ పేర్లను వేయించాలంటూ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు జారీచేసిన నిర్దేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. దీనిపై సమాధానం చెప్పాలంటూ ఆ మూడు రాష్ట్ర ప్రభుత్వాలకు దేశ సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది.కన్వరీ యాత్రా మార్గంలోని స్టాల్స్, హోటల్స్ యజమానులు ఆయా స్టాల్స్, హోటల్స్ నేమ్ ప్లేట్లపై తమ పేర్లను వేయించాలని ముందుగా



ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశాలు జారీచేసింది. ఆ తర్వాత ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు కూడా ఉత్తరప్రదేశ్‌ను అనుసరించాయి. దాంతో ఈ నిర్దేశాలను సవాల్ చేస్తూ పలు పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఆ పిటిషన్‌లపై ఇవాళ సుప్రీంకోర్టు విచారణ జరిపింది. యూపీ, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఇచ్చిన నిర్దేశాలపై కోర్టు స్టే విధించింది. అంతేగాక సమాధానం ఇవ్వాలంటూ ఆ మూడు రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కేసు తుదపరి విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది. ఆహారపదార్థాలను అమ్ముకునే వ్యాపారులు నేమ్ ప్లేట్లపై పేర్లను వేయించాలని బలవంతపెట్టడం సబబు కాదని కోర్టు వ్యాఖ్యానించింది.